క్లుప్తంగా

సీపీఆర్‌పై సదస్సు



దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో సీపీఆర్ విధానంపై 108 వాహన సిబ్బంది శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎంటీ నర్సింగరావు మాట్లాడారు. గుండెపోటుకు గురైన వ్యక్తి ప్రాణాలు కాపాడే విధానాన్ని వివరించారు. ఉపాధ్యాయులకు, పదో తరగతి విద్యార్థులకు సీపీఆర్ విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామస్వామి, 108 వాహన పైలట్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో స్వచ్ఛ్ పక్వాడ



దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం స్వచ్ఛ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎలగొండ రామస్వామి మాట్లాడారు. ఈనెల 31 వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు. పాఠశాలను, తరగతి గదులను, బల్లలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

బీసీ జేఏసీ ఎన్నిక



నర్సంపేట : పట్టణంలోని డఫోడిల్స్ హైస్కూల్ కమిటీ హాల్‌లో బీసీ సంక్షేమ సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్‌కుమార్ యాదవ్ శుక్రవారం ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ కుల సంఘాల సమావేశంలో బీసీ జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ చైర్మన్‌గా డ్యాగల శ్రీనివాస్, వైస్ చైర్మన్లుగా కొల్లూరి లక్ష్మీనారాయణ, కదారి సురేశ్ యాదవ్, రామగోని సుధాకర్ గౌడ్, పెండ్యాల యాదగిరి, గాండ్లోజు సురేందర్, కోకన్వీనర్లుగా చిలువేరు కొమ్మాలు, కందికొండ కుమారస్వామి, గట్ల నాగేశ్వరరావు, ఓర్సు సాంబయ్య, రమేశ్ ఎన్నికయ్యారు. అనంతరం నియోజకవర్గ చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ మాట్లాడారు. నేటి బీసీ బంద్‌లో అన్ని వర్గాలూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నరేందర్, నాయకులు మేడిశెట్టి శ్రీనివాస్, రామగిరి వీరేందర్, ఓదెల సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

మండల చైర్మన్‌గా ప్రకాశ్..



దుగ్గొండి : బీసీ జేఏసీ మండల చైర్మన్‌గా మండలంలోని బిక్కాజిపల్లికి చెందిన బండారి ప్రకాశ్‌ను నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా జేఏసీ చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడారు. బీసీ ప్రజల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. బీసీలు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. బీసీలకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

మసీదు కమిటీ..



నెక్కొండ : మండల కేంద్రంలో మసీదు కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ కన్వీనర్ మహ్మద్ మహబూబ్ పాషా వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా మహ్మద్ మహబూబ్ అలీ, ఉపాధ్యక్షుడుగా షేక్ అక్బర్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ అజీజ్, సహాయ కార్యదర్శిగా మహ్మద్ రఫీ, కోశాధికారిగా మహ్మద్ అమ్జద్ పాషా, కార్యవర్గ సభ్యులుగా మదార్, అమీర్, ఖలీక్ పాషా, జాఫర్, అఫ్జల్, అమానుల్లా ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు మహబూబ్ పాషా మాట్లాడారు. మసీద్ అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెక్కొండ : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నెక్కొండ యూనిట్ అధ్యక్షుడు గటిక మల్లయ్య డిమాండ్ చేశారు. స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువు భృతి, మెడికల్ రీయింబర్స్‌మెంట్, తదితర బిల్లులు విడుదల చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో సంఘం కార్యదర్శి మోహినుద్దీన్, కోశాధికారి కస్తూరి శ్రీహరి, సంయుక్త కార్యదర్శి ఈదునూరి యాకయ్య, ఉపాధ్యక్షురాలు పొగాకుల సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.

వరి పంటలో ఎండు తెగులు

- సస్యరక్షణ చర్యలతో నివారణ
- ఏఈఓ మెండు అశోక్



నర్సంపేట రూరల్ : వరి పంటలో సాధారణ బ్యాక్టీరియాతో ఆకు ఎండు తెగుళ్లు సోకి దిగుబడి తగ్గుతోంది. ఈ క్రమంలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని ఏఈఓ మెండు అశోక్ తెలిపారు. ఎండు తెగుళ్ల నివారణ కోసం ఆయన పలు సూచనలు అందించారు. ఆయన అందించిన సమాచారం మేరకు .. ఎండు తెగులు ముఖ్యంగా వర్షాలు, అధిక నత్రజని ఎరువుల వాడకం, పొలం గట్లపై పిచ్చిమొక్కలు పెరగడం వల్ల సోకుతుంది. ఈ తెగులు ఉన్నప్పుడు ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి ఎండిపోతాయి. వాటి నివారణ కోసం సరైన మోతాదులో ఎరువులు వాడాలి, పొలం గట్లను శుభ్రం చేయాలి. తెగులు సోకిన మొక్కల నుంచి ఆరోగ్యకరమైన మొక్కలకు నీరు ప్రవహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.



ఎండుతెగులుతో దెబ్బతింటున్న వరి పంట

లక్షణాలు

ఆకులపై తొలుత పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చలు ఆకుల అంచుల నుంచి ఎండిపోవడం మొదలవుతుంది. ఉదయం వేళ ఆకుల మీద పసుపు రంగు జిగురు లాంటి ద్రవం కనబడుతుంది. అది ఎండకు గట్టిపడి రాలిపోతుంది. ఆకులు గోధుమ రంగులోకి మారుయి.

సోకడానికి కారణాలు

ఎడతెరిపి లేకుండా రోజుల తరబడి వర్షాలు కురవడం. అధిక మోతాదులో నత్రజని ఎరువులు వాడకం, పొలంగట్లపై పిచ్చిమొక్కలు విపరీతంగా పెరగడం వంటివి ఎండు తెగుళ్ల సోకడానికి కారణాలు. పంట తెగుళ్లను తట్టుకోలేని రకాలను సాగు చేయడం, గతేడాది పంట అవశేషాలు, విత్తనాల ద్వారా వ్యాప్తి చెందుతాయి.

నివారణ చర్యలు

సిఫార్సు చేసిన మోతాదులో మాత్రమే నత్రజని ఎరువులు వాడాలి. పొలం గట్లపై పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలి. తెగులు సోకిన మొక్కల నుంచి ఆరోగ్యకరమైన మొక్కలకు నీరు పారకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నాటే ముందు, అంకురం ఏర్పడే దశలో ఎకరాకు 20 కేజీల చొప్పున పొటాశ్ ఎరువు వేయాలి. తెగుళ్ల ఉంటే 10 లీటర్ల నీటికి 30 గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్, 4 గ్రాములు ప్లాంటోమైసిన్ లేదా 4 గ్రాములు పోషామైసిన్/స్ట్రైప్లో సైక్లిన్ కలిపి 10–15 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలి.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించండి

- ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు

నర్సంపేట రూరల్ : సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని పంచాయతీ కార్యదర్శులను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు కోచారు. చెన్నారావుపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఇంకా నిర్మాణాలు చేపట్టని వారికి అవగాహన కల్పించాలని, గడువులోపు పూర్తి చేసుకునేలా చైతన్యవంతం చేయాలని తెలిపారు. ఎప్పటికప్పుడు ఇంటి, ఇతర పన్నులు వసూలు చేసి ట్రెజరీలో జమ చేయాలని, ఉపాధి హామీ కూలీలతో ఈకేవైజీ చేయించాలని, ప్రతిరోజూ పల్లెల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఉపాధి హామీ ఏపీఓ అరుణ, హౌసింగ్ ఏఈ భవ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఈడబ్ల్యూఎస్ కమిషన్ ఏర్పాటు చేయాలి



అభివాదం చేస్తున్న జైపాల్‌రెడ్డి, నాయకులు

- ఓసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జైపాల్‌రెడ్డి

నర్సంపేట : జాతీయ స్థాయిలో ఈడబ్ల్యూఎస్ కమిషన్ ఏర్పాటు చేయాలని ఓసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ గోపు జైపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాలులో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంది గోపాల్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించి ఓసీ జేఏసీ రెడ్డి, వెలమ, కమ్మ, బ్రాహ్మణ, వైశ్య, మార్వాడీల సమావేశంలో రాష్ట్ర నాయకులు వడ్డే చిరంజీవి, మేడవరపు కమలాకర్‌రావు, శింగిరికొండ మాధవశంకర్ గుప్తా, ఐనవోలు కృష్ణమూర్తితో కలిసి జైపాల్‌రెడ్డి మాట్లాడారు. ఓసీ కులాల్లోనూ కటిక పేదరికం అనుభవిస్తున్న కుటుంబాలున్నాయని చెప్పారు. ఓసీ కులగణన చేసి జనాభా ప్రాతిపదికన 30 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఈనెల 19న వరంగల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్ హాలులో తలపెట్టిన ఓసీ జేఏసీ సదస్సుకు హాజరు కావాలని కోరారు. సమావేశంలో నాయకులు కార్యక్రమంలో నాయకులు ఎర్ర యాకూబ్‌రెడ్డి, నల్ల మనోహర్ రెడ్డి, ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, వంగేటి గోవర్ధన్ గుప్తా, చకిలం కృష్ణమూర్తి, ముడుంబై మాధవాచార్యులు, చల్ల నర్సింహారెడ్డి, బొమ్మనపెల్లి కేశవ రెడ్డి, బుర్ర మోహన్‌రెడ్డి, తొగరు మల్లారెడ్డి, గోలి నర్సింహారెడ్డి, గుర్రాల రాఘవరెడ్డి, కట్కూరి జైపాల్‌రెడ్డి, చెరుకుపెల్లి గోపాల్‌రెడ్డి, బొద్దిరెడ్డి నర్సింహారెడ్డి, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఓంకార్‌కు ఘన నివాళి

నర్సంపేట/నల్లబెల్లి/గీసుకొండ : నర్సంపేట, నల్లబెల్లి, గీసుకొండ మండలాల్లో ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ 17వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సంపేటలో ఓంకార్ విగ్రహానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, రాష్ట్ర నాయకులు గుండెబోయిన చంద్రయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వంగల రాగసుధ, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, నాగెల్లి కొమురయ్య, గీసుకొండలో కేంద్ర కమిటీ సభ్యులు గోను కుమారస్వామి నివాళులర్పించి మాట్లాడారు. నాయకుడిగా, ఎమ్మెల్యేగా ఓంకార్ ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఓంకార్ స్ఫూర్తితో ప్రజాసమస్యలపై పోరాడతామని చెప్పారు.



నర్సంపేట : నివాళులర్పిస్తున్న నాయకులు

సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

దుగ్గొండి : సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తి కొనుగోలు చేయాలని పత్తి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ పుచ్చకాయల కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గిర్నిబావిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తికి మద్దతు ధర లభించక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. మార్కెట్‌లో క్వింటాకు రూ.6 వేలకు మించడం లేదన్నారు. రైతులను వ్యాపారులు దోచుకుంటున్నారని ఆందోళన వెలిబుచ్చారు. క్వింటాకు రూ.10 వేలు చెల్లించాలని ఆకాంక్షించారు. పెట్టుబడి, కూలీల ఖర్చు పెరిగి ఆదాయం కనీస ఖర్చులకు రావడం లేదన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు కోరబోయిన కుమారస్వామి, కటుకూరి శ్రీనివాస్ రెడ్డి, కోడం రమేశ్, కొంగర నర్సింహస్వామి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

వాటర్ ప్లాంట్ ప్రారంభం

రాయపర్తి : మండలంలోని కొండూరులోని ప్రభుత్వ హైస్కూల్‌లో స్థానికుడైన పూర్వవిద్యార్థి మహ్మద్‌ఫజల్ రహమాన్ అతడి తండ్రి మహ్మద్ అబ్దుల్ మన్నన్ జ్ఞాపకార్థం రూ.55 వేల వ్యయంతో శుక్రవారం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పద్మలత మాట్లాడారు. విద్యార్థులు పెద్దయ్యాక సమాజహితానికి తోడ్పడాలని కోరారు. ఫజుల్ రహమాన్ మాట్లాడుతూ 45 ఏళ్ల క్రితం ఆ పాఠశాలలో తాను చదువుకున్న క్రమంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంరెడ్డి, సత్యనారాయణ, రఘు, శ్యాంసుందర్, నాగరాజు, ఉషారాణి, అనిత, రాజు, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రహమాన్

క్షీరాభిషేకం



ఖానాపురం : మండలంలోని నాజీతండాలో ప్రధాని నరేంద్ర మోదీ కటౌట్‌కు బీజేపీ నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అజ్మీర రమేశ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జుగా పథకంతో తండాల్లో విద్యుత్ కాంతులు వెలుగుతున్నాయని తెలిపారు. విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని చెప్పారు. నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు, మరమ్మతులు చేపడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, బాలాజీ, ధినేశ్, వాగ్యా, సాధు, కిషన్, వీరూ, కిషన్, రమేశ్, సుందర్, అమ్ము, తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నం సరికాదు

నర్సంపేట రూరల్/నల్లబెల్లి/సంగెం : చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా (సీజేఐ) జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నం సరికాదని ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఆ పార్టీల ఆధ్వర్యంలో నర్సంపేట, నల్లబెల్లి, సంగెం మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌దీప్, నాయకులు మాదాసి బాబు, గుండేటి వీరేశ్, కొలకనూరి నిరంజన్ మాట్లాడారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బైక్ చోరీ

రాయపర్తి : మండలంలోని మైలారంలో రహదారి పక్కన నిలిపిన బైక్ చోరీకి గురైంది. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన బాధితుడు నంది వంశీధర్ రెడ్డిపోలీసులకు ఫిర్యాదు చేశాడు. జగన్నాధపల్లి క్రాస్ వద్ద బైక్ పార్క్ చేసి పనిపై పక్కకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. నిందితులను గుర్తించేలా సమీపంలోని సీసీ కెమెరాల్లోని దృశ్యాలను పోలీసులకు అందజేశారు. బైక్ ఇప్పించాలని కోరాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వర్ధన్నపేట : ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై సాయిబాబు వివరాలు తెలిపారు. వర్ధన్నపేట, రాయపర్తి డీసీ తండా శివారులోని ఎస్సారెస్పీ స్టేజ్–2 కాలువ నుంచి మట్టిను అక్రమంగా ట్రాక్టర్లలో తరలిస్తున్నట్టు నీటి పారుదల శాఖ ఏఈ బాలదాసు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సదరు ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గీసుకొండ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని అపెక్స్ కళాశాల సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. నర్సంపేటకు చెందిన గుంటి కిషన్ కారులో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా అపెక్స్ కళాశాల దగ్గరకు రాగానే తొగరాయికి చెందిన గిన్నె శివ నడుపుతున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కిషన్ తోపాటు పావునూరి శిరీష తీవ్ర గాయాల పాలయ్యారు. కిషన్ సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'కపాస్ కిసాన్'తో పారదర్శకత

సంగెం: పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు తావు లేకుండా పారదర్శకత పాటించేలా కేంద్ర ప్రభుత్వం కపాస్ కిసాన్ యాప్ రూపొందించిందని ఏఓ జ్యోత్స్న భవానీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ కేంద్రాల్లో పంటను విక్రయించి మద్దతు ధర పొందేందుకు రైతులు తప్పనిసరిగా కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. రైతులు రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ల ద్వారా స్లాట్ బుక్ చేసుకునేందుకు ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

ముందస్తుగా దీపావళి సంబరాలు

నర్సంపేట : స్థానిక శ్రీచైతన్య స్కూల్‌లో ముందస్తు దీపావళి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అమర్‌నాథ్ పండుగ ప్రాశస్త్యాన్ని వివరించారు. చెడుపై మంచి సాధించే విజయంగా అభివర్ణించారు. చీకట్లను పారద్రోలే వెలుగులకు గుర్తుగా దీపావళి జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీవిద్య, శ్రీధర్, డీజీఎం చేతన్, ఏజీఎం పద్మాకర్, అకడమిక్ కోఆర్డినేటర్ తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంద్‌ను జయప్రదం చేయాలి

సాక్షి నెట్‌వర్క్ : నేటి బీసీ బంద్‌ను జయప్రదం చేయాలని పలు రాజకీయ పార్టీలు, కుల, ప్రజా సంఘాల నాయకులు కోరారు. నర్సంపేట, నెక్కొండ, ఖానాపురం, వర్ధన్నపేట, సంగెం మండల కేంద్రాల్లో గురువారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సంపేటలో నిర్వహించిన ఆయా సమావేశాల్లో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, సీపీఐ రాష్ట్ర నాయకుడు పంజాల రమేశ్, సీపీఎం మండల కార్యదర్శి కోరబోయిన కుమారస్వామి, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, మెపా డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల యాదగిరి మాట్లాడారు. అలాగే వర్ధన్నపేటలో నిర్వహించిన సమావేశాల్లో బీజేపీ, మేదరి సంఘం నాయకులు జడ సతీశ్, ధీకొండ ఉపేందర్ మాట్లాడారు. ఖానాపురంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, బీసీ జేఏసీ మండల ఇన్‌చార్జ్ బంధారపు శ్రీనివాస్‌గౌడ్, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి గొంది నాగేశ్వర్‌రావు, సంగెంలో బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు కోడూరి వెంకట్, మునుకుంట్ల కోటేశ్వర్, నెక్కొండలో సీపీఐ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, బీఆర్‌ఎస్ నాయకులు కొమ్ము రమేశ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి యాకయ్య మాట్లాడారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమాల్లో మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, డాక్టర్ శ్రీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి కిరణ్‌కుమార్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకుడు కుమారస్వామి, సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీధర్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు హేమంత్, నాయకులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : మాట్లాడుతున్న యాదగిరి

బంద్‌కు మద్దతు

నర్సంపేట/దుగ్గొండి : నేటి బీసీ బంద్‌కు లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నర్సంపేటలో మద్దతు ప్రకటించారు. అలాగే బహుజన రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దతు తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు. బీఆర్‌ఎస్ మద్దతు తెలుపుతోందని దుగ్గొండిలో నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు తెలిపారు.

సరైన ఆహార అలవాట్లతోనే ఆరోగ్యం

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్

నర్సంపేట : సరైన ఆహార అలవాట్లతోనే ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్ తెలిపారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం, క్యాట్కో స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కాలానికి అనుగుణంగా ఆహార అలవాట్లు మారుతుండడంతో ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతోందన్నారు. విద్యార్థి దశలోనే అవగాహన పెంచుకోవాలని సూచించారు. మెరుగైన భవిష్యత్తు కోసం ఆహార అలవాట్లను అవసరమైన రీతిలో మార్చుకోవాలని చెప్పారు. క్యాట్కో ఉపాధ్యక్షుడు, జిల్లా వినియోగదారుల సంక్షేమ అధ్యక్షుడు ప్రొఫెసర్ రతన్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ ఆహారంలో రసాయనాల వాడకం నానాటికీ పెరుగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉత్పత్తిని అందించే పేరుతో, అధిక లాభాల ఆశతో ఆహారాన్ని యథేచ్ఛగా కల్తీ చేస్తున్నారని తెలిపారు. తమ సంస్థ విద్యార్థులను సోల్జర్‌గా ఎన్నుకుందన్నారు. ప్రజలను సేంద్రీయ వ్యవసాయం వైపు మళ్లించి రసాయన వాడకాన్ని తగ్గించేలా చైతన్యవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కందాల సత్యనారాయణ, స్వచ్ఛంద సంస్థ సభ్యుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, బండ్ల కాళిదాసు, అనేగు సుదర్శన్‌రెడ్డి, బెజ్జంకి ప్రభాకర్, బోయిని వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నవీన్

పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ఏఐయూకేఎస్ ప్రధాన కార్యదర్శి సూరి

నర్సంపేట : మార్కెట్ యార్డుల్లో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి అన్ని రకాల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి డిమాండ్ చేశారు. ఆ సంఘం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలోని బృందం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌ను శుక్రవారం సందర్శించింది. మొక్కజొన్న, పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేశారు. అనంతరం సూరి మాట్లాడారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను రైతులు మార్కెట్‌కు తీసుకొస్తే గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సీసీఐ అధికారులు, దళారులు కలిసి రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. మార్కెట్‌కు పంటలను తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. కంపాస్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాల్సి ఉందన్నారు. క్వింటా పత్తి రూ.12 వేలు, క్వింటా మొక్కజొన్నకు రూ.5 వేల చొప్పున మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు కత్తుల కొమురయ్య, ప్రధాన కార్యదర్శి గట్టికొప్పుల రవి, జిల్లా కోశాధికారి ధార లింగన్న, డివిజన్ ఉపాధ్యక్షుడు సింగనబోయిన కట్టన్న, నాయకులు బుచ్చన్న, లక్ష్మణ్, వెంకన్న, జవహర్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూరి

బీసీ రిజర్వేషన్లపై చట్టం చేయాలి

నర్సంపేట : బీసీ రిజర్వేషన్‌పై కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం జిల్లా కలెక్టర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంటులో చట్టం చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు జావిద్, నాయకులు రాంచందర్, సాయికుమార్, సంధాని, తరుణ్, శ్రావణ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గాలికుంటు నిరోధక టీకా తప్పనిసరి

నర్సంపేట రూరల్ : పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నిరోధక టీకా వేయించాలని భానోజీపేట పశు వైద్యాధికారి రావుల వింధ్య పాడి రైతులకు సూచించారు. ఆ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన శిబిరంలో ఆమె పలు పశువులకు టీకా వేసి మాట్లాడారు. నవంబర్ 14వ తేదీ వరకు టీకా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రవంలో సిబ్బంది మనోజ్, ఇషాక్, అన్వేశ్, గోపాలమిత్ర పెండ్యాల సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



టీకాలు పంపిణీని ప్రారంభిస్తున్న డాక్టర్ వింధ్య